ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో అధికారులు ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ మాట్లాడుతూ... డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నిబంధనల మేరకు వాహనాలను నడిపితే 90 శాతం ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు డ్రైవింగ్‌లో పాటించాల్సిన మెళకువలపై ఆయన అవగాహన కల్పించారు. వారోత్సవాలను ఈ నెల 30 వరకు నిర్వహిస్తామని డీఎం సుధాకర్ తెలిపారు. సమావేశంలో సిస్టెంట్ డీఎం రామారావు, ఏఈ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: 2024వ సంవత్సరానికి నూతనంగా భూముల పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన వారు రైతు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అర్చన కోరారు. ఈ సంవత్సరం జూన్ 18 వరకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందిన వారు ఆగస్టు 5వ తేదీ లోపు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లను దరఖాస్తు ఫారంకు జతచేసి ఈ నెల 30వ తేదీలోపు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. గతంలో బీమా ఉన్న వారు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, మార్పులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

పచ్చదనంతోనే మనుగడ



కీసర: భవిష్యత్ తరల మేలు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు వాటిని పరిరక్షించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... నాగారం మున్సిపాలిటీలో అందరి సహకారంతో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు, కాలనీవాసుల సహకారంతో పెద్ద ఎత్తున మొక్కలను నాటడంతోపాటు, వాటిని కాపాడేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారిమల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మల్లారెడ్డి



మేడ్చల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కలిశారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా మల్లారెడ్డి అసెంబ్లీ లాబీలో కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మల్లారెడ్డి పార్టీ మారుతురన్న రూమర్లకు ఆయన కేటీఆర్‌తో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టి చెక్ పెట్టారు. మండల బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. నగరంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకలలో పాల్గొని రక్తదానం చేశారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు శంకర్, విష్ణుచారి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలతోపాటు అమ్మవారికి సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పోచమ్మను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దర్శించుకున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ చేయడంతోపాటు నూతన ఆలయాల నిర్మాణాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఆలయ అధ్యక్షుడు జితేందర్, కోశాధికారి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, రాములు, బాలరాజు, హన్మంతునాయక్, విష్ణు, శ్రీకాంత్, నర్సింహ్మా, గోవర్దన్, సింధు, వెంకటేష్, శ్రీకాంత్, సుమన్, మణికంఠ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్‌లో సందడిగా వనమహోత్సవం



టౌన్‌షిప్‌లో మొక్క నాటుతున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో బుధవారం వనమహోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలో టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల సహకారంతో పచ్చదనం పెంపొందిస్తున్నట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

జవహర్‌నగర్: అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేదిలేదని కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, జవహర్‌నగర్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రవంతి హెచ్చరించారు. బుధవారం మున్సిపల్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాలలో వెలసిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ భూములలో ఎలాంటి అక్రమ నిర్మాణాలను చేపట్టవద్దని హెచ్చరించినా కొందరు కబ్జాదారులు పట్టించుకోవడంలేదన్నారు. అటువంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు.

వామ్మో.. వీధి కుక్కలు



- పిల్లలు, మహిళలపై దాడులు
- బెంబేలెత్తుతున్న చిన్నారులు, మహిళలు
- జవహర్‌నగర్ ఘటనతోనైనా మేల్కోని అధికారులు
- అధికారుల తీరుపై సర్వత్రా ఆందోళన

మేడ్చల్: ఒకప్పుడు కుక్కలంటే అందరికీ ప్రేమ ఇంటిముందు కుక్కలుంటే వాటివల్ల మనకు రక్షణ అనేదిగా ఉండేది నేడు వీధి కుక్కలు పిచ్చికుక్కల్లా పిల్లలను కరుస్తూ ప్రాణాలను తీస్తున్నాయి. కుక్కల సమస్య గ్రామాల్లో, పట్టణాల్లో అధికంగా మారడంతో విశ్వాసానికి మారుపేరుగా ఉన్న గ్రామ సింహం నేడు క్రూర జంతువుగా మారిపోయింది. కుక్కలు ఉంటే సింహాల్లా ఉంటాయని వాటి వల్ల రక్షణ ఉంటుందని వాటికి గ్రామ సింహాలుగా పిలిచుకుంటే ఆ పేరును సార్థకం చేస్తూ సింహంలా కరుస్తూ గాయపరుస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

నియోజకవర్గంలోని మేడ్చల్, పోచారం, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీల పరిధిలో జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీ ఆ కాలనీ అనికాకుండా అన్ని కాలనీల్లో వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. కుక్కలు వీధుల్లో తిరుగుతూ చిన్న పిల్లలను, మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తూ అప్పుడప్పుడు గాయపరుస్తున్నాయి. మున్సిపాలిటీలో వీధి కుక్కల కోసం ప్రత్యేక విభాగం లేకపోవడంతో సమస్యకు పరిష్కారం కనబడటం లేదు. గ్రామ సింహాలు యథేచ్ఛగా తిరుగుతూ కాలనీల్లో రోడ్ల పై వెళ్లే పిల్లలను, మహిళలను గాయపరుస్తున్నాయి. అనధికారికంగా ఎన్నో కేసులు నమోదు అవుతున్నాయి.

కుక్కల కోసం ప్రత్యేక వింగ్ కరువు...

వీధి కుక్కలను పట్టుకోవడానికి మున్సిపాలిటీల్లో ప్రత్యేక వింగ్ లేకపోవడంతో సమస్య రోజుకింత జఠిలమవుతుంది. కుక్కల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటంతో అవి కాలనీల్లో గుంపులుగా తిరుగుతూ తమ కుక్క బుద్ధి చూపుతూ అందరిని భయభ్రాంతులను చేస్తున్నాయి.

బాధ్యత లేకపోవడంతో...

కుక్కల పట్ల కొంతమందికి బాధ్యత లేకపోవడంతో వాటి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఆహారం దొరకని సమయాల్లో మనుషులపై దాడి చేస్తున్నాయి. వీధుల్లో తిరిగే కుక్కలకు ఇళ్లలో మిగిలిన అన్నం, మాంసాహారంలో బొక్కలు, ఇతర పదార్థాలను వేస్తుంటారు. వాటి కోసం కుక్కలు ఇళ్ల మధ్యనే తిరుగుతున్నాయి. కాలనీలలో ఉండే చికెన్, మటన్ షాపుల వద్ద వ్యర్థాలను కుక్కలకు ఆహారంగా వేయడంతో అవి అక్కడే తిరుగుతూ ముక్కలు దొరకని సమయాల్లో పిల్లలపై దాడి చేస్తున్నాయి. జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో చిన్నారి మరణించిన ఘటనను చూసైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. కుక్కల సమస్య తీర్చి ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

ఇవీ జాగ్రత్తలు...

జనావాసాల మధ్య ఆహారం వేయవద్దు. కుక్కలు గుంపులుగా ఉన్న చోట పిల్లలు వెళ్లకుండా జాగ్రత్త పడాలి. నీళ్లు దొరకని సమయాల్లో పిచ్చిగా ప్రవర్తిస్తాయి. నీరు అందుబాటులో ఉండేలా చూడాలి. కుక్కలను నేరుగా చూడరాదు. తల్లి, పిల్లల కుక్కల వద్దకు వెళ్లవద్దని, రాళ్లు విసరొద్దని, కుక్కలు ఉన్న చోట త్వరగా పరిగెత్తదారు.



గుండ్లపోచంపల్లిలో రోడ్లపై కుక్కలు

బ్లూక్రాస్‌తో ఒప్పందం



కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్ సంస్థతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాం. మండలంలోని బండమాదారంలోని సంస్థతో సమస్యను తీర్చ దానికి మాట్లాడుతున్నాం. సంస్థల ఒప్ప ందం వల్ల కుక్కలకు రేబిస్ టీకాలు వేయడం, పిల్లల పుట్టకుండా ఆపరేషన్‌లు చేయించడం వంటి పనులు చేస్తున్నాం. మేడ్చల్ మున్సిపాలిటీలో 1500 వరకు కుక్కలున్నట్లుగా గుర్తించగా ఇప్పటికే 500 కుక్కలకు టీకాలు వేయించాం.

– నాగిరెడ్డి మేడ్చల్ కమిషనర్

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్



నాగారం పౌర పఠణ మందిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్

కీసర: గ్రంథాలయాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన నాగారం పౌర పఠణ మందిరాన్ని గ్రంథాలయ డైరెక్టర్ ఏవీఎన్ రాజుతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ... గ్రంథాలయంలో కావాల్సిన పుస్తకాలను ఎప్పటికప్పుడు పంపించేటట్టు కృషి చేస్తానన్నారు. ఎల్లప్పుడూ గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు, నిరుద్యోగులు, సీనియర్ సిటిజన్స్ తదితరులు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కమిషనర్ జి.రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు సుర్వి శ్రీనివాస్‌గౌడ్, పంగ హరిబాబు, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, కౌకుట్ల అనంతరెడ్డి, నాయకులు మోకు జగన్మోహన్‌రెడ్డి, గూడూరు ఆంజనేయులు గౌడ్, కొమిరెల్లి సుధాకర్‌రెడ్డి, కౌకుట్ల కృష్ణారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అశోక్ గౌడ్, షఫీ, మేడ్చల్ మల్కాజిగిరి గ్రంథాలయ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెదడువాపు నివారణ టీకా

సాక్షి, సిటీబ్యూరో: మెదడు వాపు వ్యాధి నివారణ నిమిత్తం చిన్నారులకు వేసీ జేఈ టీకా కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ గురువారం నుంచి శ్రీకారం చుడుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆగస్టు 14 వరకు కొనసాగనున్న మెదడు వాపు వ్యాధి నివారణ జేఈ టీకాల కార్యక్రమాన్ని ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలో 793 అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న 1–5 ఏళ్లలోపు పిల్లలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5 నుంచి 15 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థులకు జేఈ టీకాలు వేయనున్నారు.

4.86 లక్షల మంది చిన్నారులకు టీకా

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 4,86,037 మంది చిన్నారులు ఉండగా, ఇందులో మల్కాజిగిరి డివిజన్ పరిధిలో 2,80,277 మంది ఉన్నారు. మిగతా చిన్నారులంతా కీసర రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించామని వైద్యారోగ్యశాఖ తెలిపింది. వీరందరికి మెదడు వాపు వ్యాధి నివారణకు సంబంధించి జేఈ టీకా వేయనున్నారు.

తాగునీటి సరఫరాపై సమీక్ష

కీసర: నాగారం పురపాలక సంఘ కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ సునీల్ కుమార్‌తో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీలో తాగు నీటి సమస్యలను తొందరగా పరిష్కరించేలా కృషి చేయాలని జలమండలి సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ జి.రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేమంగా ఉన్నాం.. వెతకొద్దు...

- ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం
- సోదరుడి ఫోన్‌కు వాయిస్ మెసేజ్

ఘట్‌కేసర్: ఇద్దరు పిల్లలతో ఓ వివాహిత ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల మేరకు... నగరంలోని వనస్థలిపురానికి చెందిన కోనేటి మౌనిక(32), కుమారుడు సాయిసాత్విక్(14), కూతురు వేదాద్రి(12)తో నివాసముంటూ లేడీస్ కార్నర్ నడిపిస్తుంది. ఇద్దరు పిల్లలను ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్‌లో చేర్పించింది. ఈ నెల 21న కొండాపూర్ హాస్టల్‌లో ఉంటున్న పిల్లలను చూడడాని కొచ్చి వారిని తీసుకొని ఇంటికి బయలు దేరింది. కానీ ఇంటికి చేరుకోలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ముగ్గురు ఆచూకీ లభించలేదు. మేము ముగ్గురం క్షేమంగా ఉన్నాం.. మా కోసం వెతకొద్దని ఈ నెల 21న మౌనిక తన సోదరుడి ఫోన్‌కు వాయిస్ మెసేజ్ పంపింది. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌గా వస్తుంది. దీంతో మౌనికి తల్లి ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



అదృశ్యమైన మౌనిక, సాయిసాత్విక్, వేదాద్రి (ఫైల్)

భార్య ఆత్మహత్యకు కారణమైన

వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష

మేడ్చల్: కట్టుకున్న భార్యను తరుచూ వేధిస్తూ ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు మేడ్చల్ న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ జుడీషియల్ పరిధిలోని దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021వ సంవత్సరంలో నాగూల్‌మేరా తన భార్య ఎస్.కె.లాల్‌బీని తరుచూ వేధిస్తుండటంతో ఆమె మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. లాల్‌బీ తల్లి మస్తాన్‌బీ ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు నాగూల్‌మేరాను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.అర్జున్ పైమేరకు తీర్పు వెల్లడించారు. నేరస్తుడిగా తేలిన నాగూల్‌మేరాకు మూడేళ్ల జైలు శిక్ష రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

క్రైం కార్నర్..

ఘట్‌కేసర్: అనారోగ్యం, ఆర్థిక సమస్యల కారణంగా బావిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఘట్‌కేసర్‌కు చెందిన ఎన్నబోయిన మధు(32) గతంలో నాచారంలోని జీవీకేలో ఎలక్ట్రీషియన్‌కు పని చేసేవాడు. 2018లో జానికితో అతడికి వివాహమైంది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో అతడి ఆరోగ్యం క్షీణించడంతో పరీక్షలు చేయించగా సుగర్, కొలస్ట్రాల్, కాల్షియం లోపం ఉన్నట్లు తేలింది. దీంతో మానస్థాపం చెంది రెండు నెలలుగా విధులకు వెళ్లడం లేదు. బుధవారం ఉదయం అతడి భార్య పని నిమిత్తం పొరుగు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటిలో భర్త కనిపించలేదు. ఫోన్ చేయగా అతడి స్విచ్ ఆఫ్ వచ్చింది. తక్షణమే ఆమె కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వెతకగా ఇంటి సమీపంలో ఉన్న బావిలో భర్త పాదరక్షలు కనిపించాయి. దీంతో సోదరులు, కుమారుడితో కలిసి బావిలో వెతకగా శవం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రత్నాలయంలో పంచలోహ ఆభరణాల చోరీ



ఆలయంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ, పోలీసులు

శామీర్‌పేట్: ప్రసిద్ధ రత్నాలయం ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడి బంగారు, వెండి, పంచలోహ ఆరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వివరాల ప్రకారం... అలియాబాద్ చౌరస్తా వద్ద ఉన్న రత్నాలయం వెనుకభాగం నుంచి మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు చొరబడ్డారు. వెనుక ఉన్న ఉన్న ఐరన్ గ్రిల్‌ను తొలగించి ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయంలో ఉన్న 5 తులాల విలువగల 6 మంగళ సూత్రాలు, వెంకటేశ్వర స్వామి మెడలో ఉన్న నాలుగున్నర తులాల అమ్మవారి లాకెట్, వెండి, పంచలోహ ఆభరణాలు తీసుకెళ్లారు. మొత్తం 10 తులాల బంగారం, 13.5 కేజీల వెండి, 60 కేజీల పంచలోహ విగ్రహాలను చోరీచేసినట్లు పోలీసులు తెలిపారు. ఆలయాన్ని బుధవారం పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు ప్రారంభించారు. ఐదు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పలు క్లూస్ సేకరించామని నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

కమిటీ తీర్మానంతోనే షాపుల తొలగింపు

సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



మాట్లాడుతున్న టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో షాపులను కమిటీ తీర్మానం మేరకే తొలగించామని టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు స్పష్టం చేశారు. బుధవారం సంస్కృతి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2005వ సంవత్సరంలో హౌసింగ్ బోర్డు టౌన్‌షిప్ నిర్వహణతో పాటు ఏ26, ఏ27 బ్లాకుల్లో నిర్మించిన 10 షాపులను అసోసియేషన్‌కు అప్పగించిందన్నారు. ఈ 10 షాపులు రెండేళ్ల కాలానికే పరిమితమైనప్పటికీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరగకపోవడంతో ఇంకా వాటిని కొనసాగిస్తున్నామన్నారు. వీటిలో 2, 3, 4 నెంబర్ల షాపులు మూడేళ్లుగా మూతపడి ఉన్నాయని, సుమారు రూ. 43 లక్షల అద్దె బకాయిలు పేరుకుపోవడంతో వాటిని అసోసియేషన్ సీజ్ చేసిందన్నారు. నిరుపయోగంగా ఉన్న షాపులను ఇటీవల తొలగించామన్నారు. మిగిలిన 7 షాపులను కూడా ఆగస్టు 2025లో తొలగించాలని కమిటీ తీర్మానం చేసినట్లు చెప్పారు. ఎవరికీ ఎలాంటి నష్టం జరగకుండా 2, 3, 4వ షాపులను తొగించామని, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశామన్నారు. అసోసియేషన్ కార్యదర్శి ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ... 4వ షాపును నిర్వహిస్తున్న హైమవతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వ్యక్తిగతంగా తనపై కేసు నమోదు చేశారన్నారు. పోలీసులు నోటీసును అసోసియేషన్ ఆఫీసుకు పంపకుండా తన ఇంటికి పంపడమేమిటని ప్రశ్నించారు. ఇకనైనా పోలీసులు తన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని కేసును ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి భగవాన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం



ప్రిన్సిపాల్ అంజన్‌రెడ్డి, తాతారావులను సన్మానిస్తున్న దృశ్యం

కీసర: కీసరగుట్టలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజన్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో, ఆ స్థానంలో తాతారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఇరువురిని కీసరగుట్ట ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు బేలిదే రమేష్ గుప్తా బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ టీచర్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ దిష్టి బొమ్మ దహనం

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కనీసం తెలంగాణ పేరు ఎత్తకుండా రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు ఇవ్వలేదని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు మేడ్చల్‌లో ప్రధాని నరేంద్రమోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల, మున్సిపాలిటీల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లబ్ధిదారులకు బుధవారం పంపిణీచేశారు. పట్టణంలోని కిష్టాపూర్ 4వ వార్డుకు చెందిన కె.పుష్పలతకు రూ. 18,500, లక్ష్మీకి రూ. 45 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కులను ఎమ్మెల్యే తన కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ పరిధిలో...

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఎస్వీనగర్ కాలనీకి చెందిన అన్నం భిక్షపతికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 54 వేలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు తెల్ల శ్రీధర్, కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి లబ్ధిదారునికి చెక్కును అందజేశారు.

అక్రమ నల్లా కనెక్షన్లపై ఫిర్యాదు

మేడ్చల్: ఉమానగర్ కాలనీలో మున్సిపల్ సిబ్బంది అక్రమంగా నల్లాల కనెక్షన్‌లు ఇస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇంటికి అనుమతులు లేకుండా నిర్మించి అక్రమంగా నీటి కనెక్షన్లు తీసుకున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

మేడ్చల్: 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించినా మేడ్చల్ పట్టణంలో కొంతమంది వ్యాపారులు వినియోగిస్తుండటం, విక్రయిస్తుంటడంతో మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధించారు. పట్టణంలోని 33 దుకాణాల్లో తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తూ, విక్రయిస్తుండటంతో రూ. 1,400 జరిమానా విధించారు. వ్యాపారులు ప్రభుత్వం నిషేధించిన కవర్లను వాడవద్దని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జ్యూట్ బ్యాగులు వినియోగించాలని కోరారు. డ్రైవ్‌లో ఎన్విరాల్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇంచార్జ్ శ్రీనివాస్, బిల్‌కలెక్టర్లు సుందర్‌రెడ్డి, పెంటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలం అన్యాక్రాంతంపై నిరసన



అవుషాపూర్ పార్కు స్థలం వద్ద నిరసన చేపట్టిన స్థానికులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో పార్కు స్థలం అన్యాక్రాంతంపై స్థానికులు బుధవారం నిరసన చేపట్టారు. అవుషాపూర్ రెవెన్యూ సర్వే నంబర్లు 253, 255, 256, 263, 264లలో సుమారు 65.14 ఎకరాల భూమిలో న్యూసిటీ పేరుతో 1989లో మూడు సెక్టార్లతో వెంచర్‌ను ఏర్పాటు చేశారు. 600 ప్లాట్లు చేసి ప్రజల అవసరాల నిమిత్తం 2400 గజాల స్థలాన్ని కేటాయించారు. వెంచర్ చేసిన జీపీఏ హోల్డర్ లింగారెడ్డి నిబంధనలకు వ్యతిరేకంగా ఆ స్థలాన్ని విక్రయించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు చేసిన వ్యక్తి పార్కు స్థలాన్ని చదును చేయిస్తుండగా పనులు నిలిపివేయించారు. ప్రజల కోసం వదిలిన కోట్లు విలువ చేసే స్థలాన్ని కాపాడడంలో అధికారులు విఫలం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థలం కాపాడలేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భిక్షపతిగౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఐలయ్య యాదవ్, నాయకులు కొండల్‌రెడ్డి, జంగయ్య ముదిరాజ్, వామన్‌రెడ్డి, శ్రీనివాస్, కుశలవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.